
సాక్షి
ఆదిలాబాద్
శనివారం । 31 । ఆగస్టు । 2024



ఆర్టీసీలో సెమీ డీలక్స్ 8లో▸

ఆదాయ వనరులు పెంచుకునే దిశగా ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. కొత్తగా సెమీ డీలక్స్ సర్వీసును అందుబాటులోకి తెచ్చింది.



బాబా జీవితం ఆదర్శప్రాయం

పూలాజీబాబా శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు బాబా సమాధి వద్ద పూజలు చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
20.5 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నార్నూర్: మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బలాన్పూర్‌లో నిర్వహిస్తున్న డ్రైడేను పరిశీలించారు. గ్రామంలో ఆరోగ్య పరిస్థితి, పరిసరాల పరిశుభ్రత, ప్రాథమిక కేంద్రం పనితీరును హెల్త్ సూపర్ వైజర్ చౌహాన్ చరణ్‌దాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది గణేశ్, కుమారి, విమల, కై లాస్, బొజ్జు బాయి, తదితరులు ఉన్నారు.

వసతిగృహ విద్యార్థులకు మెరుగైన విద్య



విద్యార్థిని చదివిస్తున్న పీవో ఖుష్బూగుప్తా

నార్నూర్: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని నాగల్‌కొండ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. నిత్యం పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. టీడబ్ల్యూ పీఎస్ పాఠశాలలో భోజనం నాసిరకంగా ఉండడంతో సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏటీడీవోను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం భోజనం అందించకపోవడంతో సిబ్బంది శాంతాబాయిపై చర్యలు తీసుకోవాలని సీడీపీవోకు సూచించారు. వసతిగృహ పరిసరాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

రుణమాఫీకోసం రైతుల పాదయాత్ర



కాలినడకన వస్తున్న కప్పర్ల రైతులు

తాంసి: ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం మండల కేంద్రానికి పాదయాత్రగా వచ్చారు. ఆరు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ లక్ష్మి, మండల వ్యవసాయాధికారి రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అర్హత ఉన్న రైతులకు సైతం రుణమాఫీ జరుగలేదన్నారు. రుణమాఫీపై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉత్తం, మహేందర్, నారాయణ, ప్రకాష్, రాకేష్, సదానంద్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినులను పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగదితో పాటు పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. కేజీబీవీల్లో చదివేది పేద విద్యార్థులేనని, వారికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

తాంసి: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ప్రణీత అన్నారు. పొన్నారి జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఆమె వెంట హెచ్‌ఎం రాజశంకర్, ఉపాధ్యాయురాలు శిల్ప, సిబ్బంది ఉన్నారు.

డిప్యూటేషన్ల పంచాయతీ

- బదిలీ అయి నెల రోజులు కాకముందే.. కార్యదర్శుల అక్రమ డిప్యూటేషన్లు
- పదకొండు మంది ఒకచోటు నుంచి మరోచోటికి..
- బదిలీల ప్రక్రియ అభాసుపాలు
- ఇటీవలే జెడ్పీ వ్యవహారాన్ని బట్టబయలు చేసిన 'సాక్షి'
- తాజాగా పంచాయతీ శాఖలోనూ అక్రమ డిప్యూటేషన్లు..



జిల్లా పంచాయతీ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: తంతోలి, ఇచ్చోడ గ్రామ పంచాయతీ కార్యదర్శులు అటునుంచి ఇటు వైపు.. ఇటు నుంచి అటువైపు.. తాంసి నుంచి జందాపూర్‌కు ఒకరు.. ఇలా జిల్లాలో పదకొండు మంది పంచాయతీ కార్యదర్శుల అక్రమ డిప్యూటేషన్లు గురువారం జరిగిపోయాయి. దీనికి ఆ శాఖ అధికారి కూడా ఆమోద ముద్ర వేశారు. మరికొంత మందికి సంబంధించి ప్రక్రియ కొనసాగుతుందనే ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారంలో ఒకరిద్దరు అధికారులు కీలకంగా వ్యవహరిస్తూ చక్రం తిప్పుతున్నారనే ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఇచ్చినవారు అనువైన చోటుకు వెళ్లేందుకు వీరు డిప్యూటేషన్లను అస్త్రంగా వాడుకుంటున్నారనే అపవాదు వ్యక్తమవుతోంది.

కౌన్సెలింగ్ ఎందుకు నిర్వహించినట్లు..!

గడిచిన జూలై మాసంలో ప్రభుత్వం ఉద్యోగుల బదిలీల ప్రక్రియ నిర్వహించింది. వివిధ అంశాల ఆధారంగా ఆ ప్రక్రియ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులకు సంబంధించి ఆ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కార్యదర్శులతో జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. దాంట్లో వారి చేపట్టిన పనులకు సంబంధించి ప్రగతిని ప్రామాణికంగా తీసుకుని పంచాయతీలను కేటాయించడం జరిగింది. స్థానభ్రంశం జరిగిన వారు కొత్త చోటకు వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. జూలై 30న కొన్ని శాఖలు మినహా మిగితా శాఖల్లో బదిలీలపై ప్రభుత్వం బ్యాన్ విధించింది. ఇది జరిగి నెలరోజులు కూడా కాలేదు. అక్రమంగా డిప్యూటేషన్లపై ఒక చోట నుంచి మరొక చోటకు కదులుతున్నారు. దీనికి ఆ శాఖ అధికారులే వంతు పాడటం అనుమానాలకు తావిస్తోంది. కౌన్సెలింగ్ ప్రక్రియ సరిగ్గా జరగకపోవడంతో ప్రస్తుతం డిప్యూటేషన్లు చేస్తున్నారా? అనే ప్రశ్న కూడా తలెత్తక మానదు.

అనువైన పోస్టింగ్ కోసం..

ఈ అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారంతో ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ అభాసుపాలైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉద్దేశం నెరవేరకుండానే పోతుందనే అపవాదు వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే కొంత మంది పంచాయతీ కార్యదర్శులు అనువైన పోస్టింగ్ కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. తమ నివాస ప్రాంతాలకు సమీపంగా ఉండే పంచాయతీల్లో పనిచేసేందుకు మొగ్గు చూపడం… ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న గ్రామాల్లో పనిచేయాలనుకోవడం.. అక్రమ ఆదాయం వచ్చే జీపీలను ఎంచుకోవడం.. ఇలా వివిధ కారణాలతో అక్రమ డిప్యూటేషన్లు చేయించుకుంటున్నారు.

కొనసాగుతున్న పర్వం..

ప్రభుత్వం బదిలీలపై బ్యాన్ విధించిన తర్వాత అక్రమ డిప్యూటేషన్ల వ్యవహారం జిల్లాలో వివిధ శాఖల్లో మొదలైంది. జెడ్పీలో రెండే రెగ్యులర్ సూపరింటెండెంట్ పోస్టులు ఉండగా ఒక అధికారిని ఇక్కడికి మూడో అధికారిగా డిప్యూటేషన్‌పై తీసుకొచ్చారని 'సాక్షి'లో ఈనెల 13న 'బదిలీలు.. అభాసుపాలు' శీర్షికన ఈ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకురావడం జరిగింది. దాని అనుబంధ శాఖ అయినటువంటి పంచాయతీలో తాజాగా డిప్యూటేషన్ల వ్యవహారం బయటకు వస్తుంది.

పరిపాలన సౌలభ్యం కోసం..



పరిపాలన సౌలభ్యం కోసం కొంత మంది పంచాయతీ కార్యదర్శుల డిప్యూటేషన్లు చేపట్టడం జరిగింది. స్థానిక అవసరాలు, ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకొని వీటిని చేపట్టడం జరిగింది.

– శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి, ఆదిలాబాద్

'ఎస్టీపీపీ'కి డిప్యూటీ సీఎం

- నేడు మూడో ప్లాంటు, అభివృద్ధి పనుల పరిశీలన
- 11మెగావాట్ల సోలార్‌ప్లాంటు ప్రారంభించనున్న 'భట్టి'



డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్‌ప్లాంటు (ఎస్టీపీపీ)కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తొలిసారిగా శనివారం వస్తున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పర్యటనలో భాగంగా విద్యుత్‌శాఖ మంత్రిగా ఉన్న ఆయన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించనున్నారు. ప్లాంటులో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలిస్తారు. జైపూర్‌లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో 600 మెగావాట్లు చొప్పున రెండు ప్లాంట్లలో 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. 2016లో ప్రారంభమైన ఈ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న రెండింటికి అదనంగా మూడో ప్లాంటు ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. విద్యుత్ ఉత్పత్తి చేస్తూ రాష్ట్రానికి కొరత లేకుండా చూస్తోంది. ఈ క్రమంలో ఇక్కడే సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంటును రూ.6,800 కోట్లతో నిర్మాణం చేపట్టనుంది. ఈ యూనిట్ కోసం ఇప్పటికే కేంద్రంలో పర్యావరణ, కాలుష్య తదితర శాఖల నుంచి అనుమతులు పొందింది. గతంలో టెండర్లు పిలిచినా కొంత జాప్యం జరిగింది. స్థానికంగా బొగ్గు, నీరు, అవసరమైన భూమి ఉండడంతో ఇక్కడే మరో ప్లాంటు ఏర్పాటుకు గతంలో ప్రణాళిక వేసింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించింది. గత మార్చిలో పనులు ప్రారంభం కావాల్సి ఉండగా జాప్యం జరిగింది. 15మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా ప్లాంటు ఆవరణలోని రిజర్వాయర్ నీటిపై తేలియాడే సౌరఫలకాలు ఏర్పాటు చేసింది. ఇందులో తొలి విడత ఐదు మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. అలాగే ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ), కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గించేందుకు ఏర్పాటు చేస్తున్న మిథనాల్ ప్లాంటు నిర్మాణ పనులు సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన పర్యటనలో ఈ పనులన్నీ పరిశీలిస్తారు. చెన్నూర్ మండలం శివలింగాపూర్ శివారులో ఏర్పాటు చేసిన 11మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తారు.



డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్

ఇదీ షెడ్యూల్..

డిప్యూటీ సీఎం విక్రమార్క శనివారం ఉదయం 9.30గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలికాప్టర్‌లో రామగుండంకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30గంటల వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 3.15 గంటలకు చెన్నూర్ మండలం శివలింగాపూర్ శివారులో ఏర్పాటు చేసిన 11మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30గంటల నుంచి 5.30గంటల మధ్య జైపూర్ ఎస్టీపీపీని సందర్శిస్తారు. నీటిపై తేలియాడే సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే రిజర్వాయర్‌ను పరిశీలిస్తారు. ప్లాంటు పరిపాలన భవనాన్ని ప్రారంభిస్తారు. కంట్రోల్ రూం, సీవో2 మిథనాల్ ప్లాంటు, 800 మెగావాట్ల విద్యుత్ కేంద్ర ఏర్పాటు స్థలాన్ని సందర్శిస్తారు.

బడి స్వచ్ఛతకు బాసట

- రేపటి నుండి 'స్వచ్ఛ పక్వాడా'
- పక్షం రోజులు కొనసాగనున్న కార్యక్రమం
- ఉమ్మడి జిల్లాలో 4 వేల పాఠశాలల్లో నిర్వహణ
- పరిశుభ్రత, ఆరోగ్యమే లక్ష్యాలుగా రోజుకో కార్యక్రమం



మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్న ప్రభుత్వ బడి విద్యార్థులు (ఫైల్)

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు
నిర్మల్	842
ఆదిలాబాద్	1,279
మంచిర్యాల	847
కుమురంభీం	1,148
మొత్తం	4,116

నిర్మల్‌ఖిల్లా: వానాకాలం సీజన్ నేపథ్యంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. 'స్వచ్ఛపక్వాడ' పేరిట సెప్టెంబరు 1 నుంచి పక్షం రోజులు రోజుకో కార్యక్రమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాయి. ప్రతీరోజు ప్రత్యేక కార్యక్రమం చేపట్టేందుకు పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. పరిసరాలు పరిశుభ్రంగా లేనిచోట సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నందున, పరిశుభ్రతతో వ్యాధులను దూరం చేయాలన్న లక్ష్యంతో స్వచ్ఛపక్వాడ కార్యక్రమం అమలు చేయనున్నారు. ఆరోగ్యం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన పెంచాలనే లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ స్వచ్ఛత పక్షోత్సవాలను 'స్వచ్ఛపక్వాడ' పేరిట నిర్వహించనుంది.

రేపటి నుంచి ప్రారంభం..

సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతీరోజు స్వచ్ఛ పక్వాడలో భాగంగా రోజుకో కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు సమాజంపై బాధ్యత, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, వారిలో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల విద్యాశాఖ అధికారులకు సమాచారమందించి సన్నద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో దాదాపు 4 వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా విద్యాలయాలు, గురుకుల పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. స్వచ్ఛత పక్షోత్సవాలను అన్ని పాఠశాలల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు అవగాహన పెరిగి పరిసరాల పరిశుభ్రతపై వ్యక్తిగత శుభ్రతతోపాటు సమాజానికి మేలు జరిగే అవకాశం ఉంది. కార్యక్రమంపై ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రణాళికను రూపొందించారు. ఆసక్తి అభిరుచి పెంపొందించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకుని ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

తేదీల వారీగా కార్యక్రమాలు..

- 1వ తేదీన.. ఉపాధ్యాయులు విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తారు
- 2 ,3 తేదీల్లో.. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన, చైతన్యం కల్పిస్తారు.
- 4, 5 తేదీల్లో.. పాఠశాలను సమాజానికి చేరువ చేయడం, స్థానిక ప్రజలు, విద్యావేత్తలతో విద్యార్థులు మమేకం కావడం, వారికి కూడా స్వచ్ఛత గురించి తెలియజేయడం.
- 6 న.. హరిత దినోత్సవంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులతో మొక్కలు నాటిస్తారు.
- 7, 8 తేదీల్లో.. స్వచ్ఛత భాగస్వామ్యంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస, క్విజ్ తదితర పోటీలు నిర్వహిస్తారు.
- 9, 10 తేదీల్లో.. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మధ్యాహ్న భోజన సమయంలో సరిగా కడుక్కోవడం, పరిశుభ్రత ప్రాధాన్యతను వివరిస్తారు. చేతులను శుభ్రం చేసే విధానాన్ని నేర్పిస్తారు.
- 11వ తేదీన.. వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం నిర్వహిస్తారు.
- 12న సమాజంలో విద్యార్థిని భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థి పాత్రను గుర్తింపజేస్తారు. స్వచ్ఛతపై పాఠశాల స్థాయిలో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తారు.
- 13, 14 తేదీల్లో.. స్వచ్ఛతపై ప్రణాళిక, కార్యాచరణ విధానాన్ని విద్యార్థులతో సిద్ధం చేయిస్తారు. స్వచ్ఛత ప్రాముఖ్యతను నిర్దేశిస్తారు.
- 15వ తేదీన.. 15 రోజులపాటు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తారు.

కార్యక్రమాలు ఇలా..

స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన పెంపొందించడం, సమాజ భాగస్వామ్యం కల్పించడం మొక్కలు నాటి ప్రకృతి చైతన్యాన్ని కలగజేయడం, పర్యావరణంపై అవగాహన పెంపొందించడం అనే ప్రధాన లక్ష్యాలుగా ఈ పక్షోత్సవాలను నిర్వహించనున్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పాఠశాలస్థాయి పోటీలు కూడా నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తారు.

ఆ కాంట్రాక్టర్ టెండర్ క్యాన్సిల్ చేయండి

- అధికారులకు కలెక్టర్ రాజర్షి షా ఆదేశం

కై లాస్‌నగర్: కుంటాల జలపాతం వద్ద చేపట్టిన టూరిజం పనులు సక్రమంగా జరగడంలేదని కలెక్టర్ రాజర్షి షా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లి స్మృతివనం, కుంటాల టూరిజం పనులు, అటవీశాఖ అనుమతులు, రోడ్లు, భవనాల నిర్మాణాలపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంటాల ప్రాజెక్ట్ వద్ద పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని, అప్పటికీ స్పందించకుంటే టెండర్ క్యాన్సిల్ చేయాలని ఆదేశించారు. రానున్న నాలుగు నెలల్లో 50 శాతం పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావు, ఆర్అండ్‌బీ ఈఈ నర్సయ్య, పీఆర్ డీఈ రాథోడ్ శివరాం, డీఎంహెచ్ఓ కృష్ణ, డీఎంఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం లక్ష్యం పూర్తి చేయాలి

తలమడుగు: జిల్లాకు కేటాయించిన ఆయిల్‌పాం సాగు లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని బరంపూర్‌లో ఆయిల్‌పాం నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 2,100 ఎకరాల సాగు లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 1500 ఎకరాల్లో రైతులను గుర్తించామన్నారు. మిగతా రైతులను గుర్తించి సాగును పెంచాలన్నారు. అనంతరం సుంకిడి గ్రామంలోని రైతు వేదికలో రుణమాఫీ కానీ రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శేఖర్, రైతులు కేదారేశ్వర్ రెడ్డి, మానిష్‌రెడ్డి, వెంకన్న యాదవ్, మహేందర్ యాదవ్, శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.



సుంకిడిలో రుణమాఫీ వివరాల నమోదు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన భోజనం

ఇచ్చోడ: ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన భోజనం అందించనున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌తో కలిసి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, ఎంపీడీవో లక్ష్మణ్, డెప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఐకేపీ ఏపీఎం దయాకర్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు



సమావేశ మందిరం ఎదుట నిరీక్షిస్తున్న సీడ్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, రైతులు

కైలాస్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత పదేళ్లపాలనలో రాష్ట్ర సీడ్ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆ సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి ఆరోపించారు. ప్రైవేట్ కంపెనీల విత్తనాలపై ఆధారపడేలా చేసి రైతులను సంస్థకు పూర్తిగా దూరం చేశారని మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందజేసి ఆదుకుందన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరిట అన్ని సబ్సిడీలను ఎత్తివేసి వారికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కాగా తొలిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు చేదు అనుభవం ఎదురైంది. సమావేశ మందిరం తాళాలు వేసి ఉండటంతో దాదాపు 40 నిమిషాల పాటు చైర్మన్ సహా, రాష్ట్ర ఉన్నతాధికారులు అక్కడే నిరీక్షించాల్సి వచ్చింది.

మహిళలకు అండగా 'మీతో సాక్షి'

- సైబర్ క్రైమ్ డీఎస్పీ హసిబ్ ఉల్లా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ హసిబ్ ఉల్లా

నార్నూర్: సాక్షి దిన పత్రిక నిర్వహిస్తున్న 'మీతో సాక్షి' కార్యక్రమం మహిళలకు ఎంతో భరోసానిస్తోందని సైబర్ క్రైమ్ డీఎస్పీ హసిబ్ ఉల్లా అన్నారు. శుక్రవారం మాన్కాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో సీఐ రహీంపాషాతో కలిసి 'మీతో సాక్షి' పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జి వాణి ఆత్మరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలికలకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా మహిళలను వేధిస్తే డయల్ 100తో పాటు షీ టీం 8712672222, 'మీతో సాక్షి' వాట్సాప్ నంబర్ 8977794588కు పూర్తి వివరాలతో సమాచారం అందించాలని సూచించారు. సమాచారాన్ని 'సాక్షి' తెలంగాణ మహిళ భద్రతా విభాగం డీజీ శిఖాగోయల్ దృష్టికి తీసుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ రియాజ్, ప్రధానోపాధ్యాయుడు దేవ్‌షా, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

కుంటాల: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్మల్ గండిరామన్న సాయిబాబా ఆలయ ఆవరణలో అండర్–16, 19 క్రికెట్ పోటీలను నిర్వహించారు. కుంటాల విజయసాయి పాఠశాలకు చెందిన జాదవ్ విక్రమ్ అండర్–16, రాథోడ్ నిశాంత్ అండర్–19 విభాగాలలో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో సెప్టెంబర్ 5న నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. వీరిని ప్రిన్సిపాల్ స్వప్న, పీఈటీ రాథోడ్ అరవింద్ శుక్రవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలి

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ కబడ్డీ ఎంపిక పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం నర్సయ్య, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, పీడీలు జ్యోతి, నాందేవ్, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్, కళ్యాణ్, రవీందర్, జయవంతరావు, మోహన్, త్రివేణి, జయశ్రీ పాల్గొన్నారు.

నూతన భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయ నూతన భవనాన్ని కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ఎమ్మెల్యే పాయల్ శంకర్ శుక్రవారం ప్రారంభించారు. నూతనంగా రూపొందించిన సీఓసీ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి అనుబంధంగా ఉన్న వ్యాపార రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం వారిని సీఓసీ ప్రతినిధులు పూలమాల, శాలువలతో సత్కరించారు.మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, సీఓసీ అధ్యక్షుడు కమల్ కిశోర్, ప్రధాన కార్యదర్శి సంతోష్ పాల్గొన్నారు.

సమ్మె విరమణ

నిర్మల్‌టౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సమ్మె విరమించారు. వేతనాల కోసం నాలుగు రోజులుగా సమ్మె చేసిన కార్మికులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజుతో చర్చలు జరిపారు. పెండింగ్ జూన్, జూలై వేతనాలలో జూన్ నెల వేతనం వారి అకౌంట్లో జమచేశారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శనివారం నుంచి విధులకు హాజరవుతారని కార్మికులు తెలిపారు.

మహిళను కాపాడిన బ్లూకోల్ట్స్ పోలీసులు

సోన్: మండలంలోని మాదాపూర్ గోదావరి పుష్కరఘాట్ వద్ద శుక్రవారం ఆత్మహత్యకు యత్నించిన మహిళను బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా కొండాపూర్‌కు చెందిన మహిళ ఆత్మహత్యకు చేసుకునేందుకు మాదాపూర్ గోదావరి నది పుష్కరఘాట్ వద్దకు వచ్చింది. ఆ సమయంలో భర్త శ్రావణ్ డయల్ 100కు ఫోన్ చేశాడు. బ్లూకోల్ట్స్ పోలీసులు శేఖర్, నరోత్తం ఘటన స్థలానికి వెళ్లి మహిళను కాపాడారు. తండ్రికి ఆమెను అప్పగించారు. ఈ సందర్భంగా బ్లూకోల్ట్స్ పోలీసులను సీఐ నవీన్ కుమార్, ఎస్సై గోపి అభినందించారు.

ఆర్టీసీలో సెమీ డీలక్స్



సెమీ డీలక్స్ బస్సు

- అందుబాటులోకి కొత్త సర్వీస్‌లు
- ప్రయోగాత్మకంగా పలు రూట్లలో సేవలు
- ఆదిలాబాద్ రీజియన్‌లో స్పందన
- ప్రయాణికులకు సౌకర్యం.. సంస్థకు ఆదాయం

ఆదిలాబాద్: ఆదాయ వనరులు పెంచుకునే దిశగా ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. కొత్తగా సెమీ డీలక్స్ సర్వీసును అందుబాటులోకి తెచ్చింది. ఆదిలాబాద్ రీజియన్ డిపోల్లో పలు రూట్లలో ప్రయోగాత్మకంగా సేవలందిస్తుండడంతో స్పందన లభిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. దీంతో బస్సుల్లో రద్దీ పెరిగింది. 'మహాలక్ష్మి'పథకం నిధులను ఆర్టీసీకి రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. దీంతో సంస్థకు ఆదాయం తగ్గడంతో టికెట్ ఆదాయం పెంపుపై దృష్టిపెట్టి సెమీడీలక్స్ బస్సు సర్వీసులను ప్రవేశపెట్టింది.

పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో

మహాలక్ష్మి పథకం అమలు ముందు బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో మోస్తరుగా ఉండేది. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌ల్లో తప్పితే మిగతా సమయాల్లో ఓఆర్ 65 శాతం నమోదయ్యేది. ప్రస్తుతం 80 నుంచి 100 శాతం వరకు నమోదవుతుంది. ముఖ్యంగా పండుగ సమయాల్లో సెంచరీ దాటుతోంది. పలు సందర్భాల్లో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్తున్న సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఓఆర్ శాతం పెరగడం, 'మహాలక్ష్మి'ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కారణంగా సంస్థకు వచ్చే ఆదాయంపై ప్రభావం పడుతుంది. రోజువారీ ఖర్చులు, నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు తదితర వాటికి ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని సెమీ డీలక్స్ బస్సులను తీసుకువచ్చింది.

ఎక్స్‌ప్రెస్‌కు ఎక్కువ..డీలక్స్‌కు తక్కువ

ఎక్స్‌ప్రెస్‌తో పోల్చితే సెమీ డీలక్స్ బస్సు చార్జీ ఎక్కువ. డీలక్స్ కంటే తక్కువగా వసూలు చేస్తున్నారు. సెమీడీలక్స్ బస్సు కి.మీ 137 పైసలుగా చార్జీని నిర్ణయించారు. ఎక్స్‌ప్రెస్ బస్సు కి.మీ 126 పైసలు ఉండగా డీలక్స్‌కు కి.మీ 144 పైసలు తీసుకుంటున్నారు. మినిమం టికెట్ చార్జీ మాత్రం ఎక్స్‌ప్రెస్, సెమీ డీలక్స్ బస్సుల్లో సమానంగా తీసుకుంటున్నారు. దీంతో పలువురు ప్రయాణికులు సెమీ డీలక్స్ బస్సుల వైపు మొగ్గు చూపుతున్నారు.

బస్సు స్వరూపం ఇదీ..

ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు 10 మీటర్ల పొడవు, 51 సీట్లను కలిగి ఉంటాయి. అయితే సెమీడీలక్స్ బస్సు 12 మీటర్ల పొడవు ఉంది. 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక వైపు 3, మరో వైపు 2 సీట్లు ఉండడం, ఆకర్షణీయమైన సీట్ కవర్లతో ఆకట్టుకునేలా తయారు చేశారు. ప్రయాణికులు వీటికి మొగ్గుచూపుతారని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

ఆదిలాబాద్ రీజియన్‌కు 4 బస్సులు

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో నాలుగు సెమీ డీలక్స్ బస్సులను కేటాయించారు. నిర్మల్ డిపోకు రెండు బస్సులను కేటాయించగా, ఆదిలాబాద్ డిపోకు ఒకటి, మంచిర్యాల డిపోకు ఒక సర్వీస్ కేటాయించారు. ఈ సర్వీస్ లను రద్దీని బట్టి వివిధ రూట్లలో నడుపుతున్నారు. ముఖ్యంగా పండుగల సమయాల్లో ఈ సర్వీసులు ఎంతగానో ప్రయాణికులకు ఉపయోగపడుతున్నాయి.

ప్రయాణికుల స్పందనతో ముందుకు..



ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 4 సెమీడీలక్స్ బస్సులు నడుపుతున్నాం. బిజీ రూట్లలో కేటాయిస్తున్నాం. సందర్భాన్ని బట్టి ఏ ఏయే రూట్లలో అవసరమో నిర్ణయించి సర్వీసును నడుపుతున్నాం. ప్రయాణికుల స్పందన చూసి ముందుకెళ్తాం.

– సోలోమన్, ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్

ఆదిలాబాద్ రీజియన్‌లో బస్సుల వివరాలు..

డిపో	ఎక్స్‌ప్రెస్	పల్లెవెలుగు	సెమీ డీలక్స్	మొత్తం
ఆదిలాబాద్	34	67	01	102
భైంసా	09	65	00	74
నిర్మల్	37	65	02	104
ఉట్నూర్	00	25	00	25
ఆసిఫాబాద్	07	56	00	63
మంచిర్యాల	21	84	01	106

వెబ్‌సైట్‌లో గణేశ్ మండపాల వివరాలు

- ఎస్పీ గౌస్ ఆలం



ఆదిలాబాద్‌టౌన్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్ట భద్రత ఏర్పాట్లు చేసిందని ఎస్పీ గౌస్ ఆలం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పండుగను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ రూపొందించిన https://policeportal. tspolice. gov. in వెబ్‌సైట్‌లో మండపం వివరాలతో పాటు మండప ప్రదేశం, వివరాలు, విగ్రహం–మండపం ఎత్తు, సంబంధిత పోలీస్ స్టేషన్, నిమజ్జన ప్రదేశం తదితర సమాచారం పొందుపర్చాలని జిల్లాలోని నిర్వాహకులు, కమిటీ సభ్యులకు సూచించారు. ఆన్‌లైన్‌తోపాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి గణపతి విగ్రహాలు ప్రతిష్ఠించాలని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దు

- డీఎంహెచ్‌వో కృష్ణ



టీ–హబ్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: టీ–హబ్ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని డీఎంహెచ్‌వో కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి రిమ్స్ ఆవరణలోని టీ–హబ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేనేజర్ హరీష్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్లు పనిచేస్తున్నాయా.. లేదా, డెంగీతోపాటు ఏయే టెస్టులు చేస్తున్నారు, జిల్లాలోని పీహెచ్‌సీల్లో రోజువారీగా ఎన్ని నమూనాలు వస్తున్నాయి, ఎంత సమయంలో రిపోర్టులు అందజేస్తున్నారనే దానిపై ఆరా తీశారు. పరిసరాలతోపాటు టీ–హబ్‌ను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. 24 గంటల్లోపే రిపోర్టులను అందించాలని ఆదేశించారు. ఏవైన ఇబ్బందులుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. మలేరియా నివారణ అధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్, వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- మాజీ మంత్రి జోగు రామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో జిల్లా వివక్షకు గురవుతుందన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్థూపం సాక్షిగా జిల్లాను దత్తతగా తీసుకున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషజ్వరాలతో జిల్లా ప్రజలు అల్లాడుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. సీజనల్ వ్యాధులను కట్టడి చేయాలన్నారు. ఇన్‌చార్జి మంత్రి ఉన్నప్పటికీ అధికారులతో సమీక్షించడం లేదని, క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్వచ్ఛదనం.. పచ్చదనం పేరిట కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ ఎలాంటి నిధులు కేటాయించడం లేదన్నారు. పీహెచ్‌సీల్లో మందుల కొరత ఉందన్నారు. జిల్లాలో వైద్యుల కొరత వేధిస్తుందన్నారు. ఒకోక బెడ్‌పై ముగ్గురేసి రోగులకు చికిత్స అందిస్తున్నారని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, మెట్టు ప్రహ్లాద్, నర్సింగ్‌రావు, ఇజ్జగిరి నారాయణ, అజయ్, సాజిదొద్దిన్, రాజు, జగదీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

- సమస్యలు పరిష్కరించాలి
- ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైఠాయింపు



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆదిలాబాద్‌టౌన్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. జిల్లాకేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం బైఠాయించారు. అంగన్‌వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీలకు, ఆయాలుగా పదోన్నతులు పొందినవారికి వేతనం చెల్లించాలని డిమాండ్‌చేశారు. జిల్లాలో 400 మంది మినీ అంగన్‌వాడీలు మెయిన్ అంగన్‌వాడీలుగా పనిచేస్తున్నారని తెలిపారు. జనవరిలో మెయిన్ టీచర్లుగా పదోన్నతి కల్పించినప్పటికీ వేతనం రూ.7800 చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అంగన్‌వాడీల సంఘం అధ్యక్షురాలు వెంకటమ్మ, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు దర్శనాల మల్లేశ్, నాయకులు చిన్నన్న, అంగన్‌వాడీ సంఘం సభ్యులు రత్నమాల, భారతి, పార్వతి, ముక్తా, హారిక, హంసా, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

వైన్స్‌షాపు చోరీ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేశ్

నేరడిగొండ: వైన్స్ షాపులో చోరీకి పాల్పడిన దొంగలను అరెస్టు చేసినట్లు ఇచ్చోడ సీఐ భీమేశ్ తెలిపారు. నేరడిగొండ పోలీసుస్టేషన్‌లో సీఐ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్రకు చెందిన చౌహాన్ రవి, స్నేహితులు 11 మంది సభ్యులు వరుస చోరీలకు పాల్పడుతున్నారు. ఈనెల 24న నేరడిగొండలో తరుణ్ వైన్స్ షాపులో చోరీ చేశారు. వైన్స్ యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం 10 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.20వేల నగదుతోపాటు రూ.50వేల విలువ గల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఏ1 నిందితుడు చౌహాన్ రవి పరారీలో ఉన్నాడు. సమావేశంలో ఎస్సై శ్రీకాంత్, పోలీసులు పాల్గొన్నారు.


బాసరలో సామూహిక వరలక్ష్మీ వ్రతం



వరలక్ష్మీ పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు.

బాసర: బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు అనంతరం దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని తమ చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. అనంతరం కుంకుమార్చనలు చేశారు. శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్నారు. అక్షరాభ్యాస మండపంలో ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారితోపాటు ఇతర వైదిక బృందం వరలక్ష్మీ వ్రతం, విశేష పూజలను నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయం తరపున ఉచితంగా పూజా సామగ్రిని అందజేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

'కడెం' మూడు గేట్లు ఎత్తివేత



వరద గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న నీళ్లు

కడెం: నిర్మల్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెంకు శుక్రవారం భారీగా వరద వచ్చింది. దీంతో ప్రాజెక్టు అధికారులు మూడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రాజెక్టులోకి 25,403 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని తెలిపారు. మూడు గేట్ల ద్వారా 21,749 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలామని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 700(7.603టీఎంసీ) అడుగులు కాగా, ప్రస్తుతం 698.775(7.283టీఎంసీ) అడుగులు ఉందని వెల్లడించారు.

వృద్ధురాలి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తాటిగూడకు చెందిన వృద్ధురాలు గుమ్ముల గంగమ్మ అదృశ్యమైంది. ఈనెల 28న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో శుక్రవారం ఆమె కుమారుడు అశోక్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కరుణాకర్‌రావు తెలిపారు.

ఇద్దరు జూనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిలుగా పనిచేస్తున్న ఇద్దరికి పదోన్నతి లభించింది. ఈమేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆదిలాబాద్ జూనియర్ సివిల్ జడ్జి, జుడీషియల్ మెజిస్ట్రేట్ మంజూల సూర్యవార్, మంచిర్యాల జూనియర్ సివిల్ జడ్జి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సి.సంపత్‌లకు పదోన్నతి కల్పించారు.

గంజాయి కేసులో రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి కేసులో ఈనెల 25న పట్టుబడ్డ షేక్ షన్నును టూటౌన్ పోలీసులు రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. అయితే ఆయనకు గంజాయి విక్రయించిన తాటిగూడకు చెందిన రేష్మా సుల్తానను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు వివరించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

ఇచ్చోడ: పురుగుల మందు తాగిన యువతి రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. మండలంలోని ముఖరా(కే) గ్రామానికి చెందిన తల్వారే శ్రీదేవి (18) గత కొన్నిరోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. నొప్పి భరించలేక ఈనెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందింది. తండ్రి వెంకటి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఇండక్షన్ ప్రోగ్రాం



అవగాహన కల్పిస్తున్న వక్త

బాసర : బాసర ట్రిపుల్ ఐటీలో కళలు, క్రీడలు, ఇండక్షన్ ప్రోగ్రాం లో భాగంగా వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు క్రీడారంగము, సృజనాత్మక కళలు, నైతిక విలువలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వక్తలు ప్రభాకర్‌రావు, డాక్టర్ విజయ్కుమార్, డాక్టర్ నాగసాయి హాజరై ఆయా అంశాలపై మాట్లాడారు. విద్యతోపాటు కళలు, క్రీడలు, విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రాచీన కాలం నుంచి లలిత కళలైన చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నృత్యం, కవిత్వం అంశాలు ఎలా ప్రాచుర్యం పొందాయో వివరించారు. ఇతిహాసాలు, పురాణాల ఆధారంగా నైతిక విలువలు పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, పోటీతత్వం పెరుగుతుందని, స్నేహభావం పెరుగుతుందని వివరించారు. వ్యాయామంతో ఉత్తేజం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త కిరణ్‌కుమార్, పవన్ శిరసాని, విద్యార్థులు పాల్గొన్నారు.

23 మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

కైలాస్‌నగర్: జిల్లాలోని 23 గ్రామ పంచాయతీ కార్యదర్శులకు డీపీవో శ్రీలత షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా సవరణ, వార్డుల విభజన కార్యక్రమం నేపథ్యంలో విధులకు రాకుండా సెలవులు పెట్టిన వారందరికీ నోటీసులు అందజేశారు. తక్షణమే విధుల్లో చేరాలని, నోటీసులకు వివరణ అందించాలని అందులో స్పష్టం చేశారు. లేకపోతే చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకే ఈ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉంటే అధికారుల చర్యల నుంచి తప్పించుకునేందుకు పలువురు కార్యదర్శులు తమదైన రీతిలో పైరవీలు ప్రారంభించడం ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

బీజేపీతోనే మున్సిపాలిటీ అభివృద్ధి

ఆదిలాబాద్: బీజేపీతోనే మున్సిపాలిటీ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు సంజీవ్, భరత్, 6వ వార్డు కౌన్సిలర్ నెమలికొండ కరుణ కుమారుడు దయాకర్ శుక్రవారం బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అమృత్ 2.0 పథకం కింద రూ. 320 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కౌన్సిలర్లు ఉష్కం రఘుపతి, ప్రవీణ్, కృష్ణ యాదవ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు లాలా మున్నా, వేద వ్యాస్, ముకుందరావు, సచిన్, సూర్య కిరణ్, శివ, రాజు, రమేశ్, నాగన్న ఉన్నారు.

తెగిన తాత్కాలిక వంతెన



వరదలకు కొట్టుకుపోయిన వంతెన

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ నుంచి కుర్రగూడెం వెళ్లేదారిలో తాత్కాలిక వంతెన తెగింది. బుధవారం రాత్రి వరదలకు కొట్టుకుపోవడంతో ధర్మాజీపేట్ పంచాయతీ పరిధిలోని కుర్రగూడెం, పాత రేవోజీపేట్ గ్రామస్తులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కుర్రగూడెం ప్రధాన రహదారి కల్వర్టు రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోగా, తాత్కాలిక వంతెన ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తెగిపోవడంతో ప్రజాప్రతినిధులు వంతెన పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని గిరిజన మోర్చా అధ్యక్షులు భీమేశ్, మధు, చందు, వెంకటేశ్, వేణు కోరారు.

భారీ వర్షంతో రాకపోకలు బంద్



తాత్కాలిక రోడ్డు పైనుంచి వెళ్తున్న వరద

ఖానాపూర్: గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఖానాపూర్ మండలంలో 38 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంతోపాటు ఎగువన కురిసిన వర్షాలతో రెంకోని వాగుకు భారీ వరదనీరు వచ్చింది. ఖానాపూర్–దిలావర్‌పూర్ మార్గంలోని తాత్కాలిక రోడ్డు దెబ్బతింది. దీంతో సుమారు 20కి పైగా గ్రామాల ప్రజల రాకపోకలకు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వినాయక్‌చౌక్ ప్రాంతంలో గల ప్రైవేట్ పాఠశాల ఎదురుగా ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. గురువారం రాత్రి ఏటీఎంలోకి చొరబడి మిషన్‌ను పగలగొట్టేందుకు యత్నించారు. యంత్రం నుంచి శబ్దం రావడంతో అక్కడి నుంచి పరారైనట్లు వన్‌టౌన్ ఎస్సై సయ్యద్ ఇసాఖ్ అలీ తెలిపారు. ఎస్బీఐ చీఫ్ మేనేజర్ పెనమూర్తి సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నట్లు వివరించారు.